సాక్షి
హైదరాబాద్, శనివారం, 5, అక్టోబర్, 2024

అందరికీ ఆధునిక వైద్యం అందాలి

పోచారం: ఆధునిక వైద్య సేవలు అందరికీ అందుబాటులో ఉండేలా వైద్యులు కృషి చేయాలని కౌన్సిలర్ బి.హరిప్రసాదరావు అన్నారు. శుక్రవారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో సంస్కృతి క్లినిక్ ఆధ్వర్యాన నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని వైద్యులు తమ సేవలను అందించాలన్నారు. ఈ శిబిరంలో షుగర్, డెంగీ, జ్వరం, థైరాయిడ్, ఒళ్లు నొప్పులు, కడుపు నొప్పి, బీపీ, ఆస్తమా, ఛాతీ నొప్పి, కీళ్ల నొప్పులు, విరేచనాలు, వాంతులు, నడుం నొప్పి, చిగున్‌గున్యాతో బాధపడుతున్న వారిని వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఎస్.గీతశ్రీ, నిర్వాహకులు పల్లె విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రియాల్టీ అప్లికేషన్లపై కృత్రిమ మేధ ప్రభావం

పోచారం: వర్చువల్ రియాలిటీతో పాటు అగ్‌మెంటెడ్ రియాలిటీ అప్లికేషన్లలోనూ కృత్రిమ మేధ ప్రభావం కీలకంగా మారిందని సైమాక్స్ ఇన్ఫోటైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ ఎం.గౌరీశంకర్ అన్నారు. చౌదరిగూడలోని నల్ల నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం అగ్‌మెంటెడ్, వర్చువల్ రియాలటీలపై నిర్వహించిన హ్యాకథాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్లెట్లు వంటి పరికరాలతో అగ్‌మెంటెడ్ రియాలిటీని, హెడ్‌సెట్స్ వంటి టూల్స్‌తో వర్చువల్ రియాలిటీని అభివృద్ధి చేస్తున్న ప్రక్రియను కృత్రిమ మేధ ఎంతగానో ప్రభావితం చేస్తుందన్నారు. ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ జి.జనార్దన్ రాజు మాట్లాడుతూ... సాంకేతికతను వినోదంతో పాటు ఈ-కామర్స్, విద్య, వైద్య తదితర రంగాలలో కీలక సేవలకు ఎలా వినియోగించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న 150 మంది విద్యార్థులను 24 బృందాలుగా విభజించి హ్యాకథాన్ నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ సీవీ కృష్ణారెడ్డి, హెచ్‌ఓడీలు డాక్టర్ కె.రామేశ్వరయ్య, డాక్టర్ రవి బొలిమేర, టీపీఓ కే.శ్రీకాంత్, ఐఐసీ కో ఆర్డినేటర్ డాక్టర్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

'డబుల్'.. గుబుల్!

- సమస్యల సుడిలో రాంపల్లి 'డబుల్' ఇళ్లు
- అరకొర వసతులతో లబ్ధిదారుల పరేషాన్
- సౌకర్యాలు లేక తప్పని ఇబ్బందులు
- అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రా ఆగ్రహం


రాంపల్లి డబుల్‌బెడ్‌రూం గృహ సముదాయాలు


'సాక్షి' బృందానికి సమస్యలు తెలుపుతున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు

కీసర: నాగారం పురపాలక సంఘం పరిధిలోని రాంపల్లి వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కనీస వసతులు లేక ఆయా ఇళ్లలో ఉండేందుకు లబ్ధిదారులు సుముఖత చూపడం లేదంటే అక్కడ పరిస్థితులు ఎంత దుర్భరంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

◆ రాంపల్లి డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు మీతో 'సాక్షి' బృందం ఆయా సముదాయాల్లో పర్యటించింది. లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంది.

◆ నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీ+10 విధానంలో నిర్మించిన భవనాల్లో 6240 డబుల్ బెడ్ రూం ఇళ్లు ఉన్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ ప్రభుత్వం నగరంలోని అంబర్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్, యాకుత్‌పురా, మలక్‌పేట తదితర ప్రాంతాలకు చెందిన నిరుపేదలకు ఆయా ఇళ్లను పంపిణీ చేసింది.

◆ అది మొదలు ఇప్పటి వరకు డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద అవసరాలకు తగ్గట్టుగా ఎలాంటి సౌకార్యలు కల్పించలేదంటూ లబ్ధిదారులు వాపోతున్నారు.

◆ రవాణా, మంచి నీరు, స్కూల్, ఆస్పత్రి తదితర వసతులతోపాటు ఉపాధి అవకాశాలు లేకపోవడంతో తాము ఇక్కడ ఉండలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

◆ అరకొర వసతుల కారణంగా ప్రస్తుతం ఇక్కడ 200 కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. సౌకార్యాలు కల్పిస్తే లబ్ధిదారులందరూ ఇక్కడ నివసించేందుకు ముందుకు వస్తారని స్పష్టం చేస్తున్నారు.

వంతులు వారీగా...



డబుల్ బెడ్ రూం గృహ సముదాయాల వద్ద రోజూ ప్రజలకు అవసరమైన నీటిని సరఫరా చేసేందుకు మున్సిపల్ సిబ్బంది ఎవరూ అందుబాటులో ఉండటం లేదు. ఇళ్ల లబ్ధిదారులంతా కలిసి వంతులు వారీగా ఉదయం, సాయంత్రం వేళల్లో బోర్లు ఆన్ చేసుకొని సంప్‌ల నుంచి కాలనీలో నీటిని సరఫరా చేసుకుంటున్నాము.

– నర్సింహారావు

ఉపాధి కల్పించాలి



ఇల్లు వచ్చిందనే ఆనందం కంటే ఇక్కడి ఇబ్బందులే మాకు చాలా ఆందోళన కల్గిస్తున్నాయి. కనీస వసతులు కూడా ఇక్కడ లేకపోవడం బాధాకరం. రెక్కాడితేగానీ డొక్కాడని మాకు ఇక్కడ ఎలాంటి ఉపాధి దొరకవడం లేదు. ప్రభుత్వం మా ఇబ్బందులను సహృదయంతో అర్థం చేసుకొని మాకు ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరుతున్నా.

– రమేష్

మీతో సాక్షి

రవాణా కల్పించాలి



రాంపల్లి డబుల్ బెడ్ రూం గృహ సముదాయాల వద్దకు సరైన రవాణా సౌకర్యం లేదు. ఈ కారణంగా తాము ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. పిల్లలు పాఠశాలలతోపాటు ఇక్కడ ఉంటున్న ఎంతో మంది ఉద్యోగులు, నగరానికి రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ఇకనైనా ఇక్కడి నుంచి నగరానికి బస్సు సౌకర్యాం కల్పించాలి. చర్లపల్లి ప్రధాన రహదారి నుంచి ఇక్కడి వరకు రోడ్డు కూడా సరిగా లేదు. ఆ రోడ్డు మరమ్మతు చేస్తే రాకపోకలు సాగించేందుకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

– కోనూరి కుమారి

ప్రారంభించని లిఫ్టులు



రాంపల్లి డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయాల వద్ద జి + 10 విధానం ఇళ్లను నిర్మించారు. మేము 7వ అంతస్తులో ఉంటాము. 60 ఏళ్లపైన వయస్సున్న నేను ఏ చిన్న వస్తువు లేదా మంచి నీటి కోసమైనా ఎక్కి దిగాలంటే ఎంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. దీన్నిబట్టి ఇక్కడ పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. లిఫ్టులు ఏర్పాటు చేసినా ఇప్పటివరకు వాటిని ప్రారంభించలేదు. వెంటనే ఆయా లిఫ్టులను ప్రారంభించి స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– అస్మరి బేగం

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సత్వరమే ప్రారంభించాలి

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



సాక్షి, సిటీబ్యూరో: రేషన్ కార్డుదారులకు ప్రథమంగా 2025 జనవరి నుంచి సన్న బియ్యం పంపణీ చేసేందుకు ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని, అందులో భాగంగా రైతుల నుంచి క్వింటాల్‌కు రూ. 500 అదనపు బోనస్‌తో కొనుగోలు కేంద్రాలలో సన్న ధాన్యం సేకరించటానికి అనుమతి ఇచ్చిందని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) డి.విజయేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వర్షా కాలానికి సంబంధించి ‘ధాన్యం సేకరణ’పై సంబంధిత జిల్లా అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ధాన్య సేకరణ కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, రైస్ మిల్లుల యజమానులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ... రైతులు తడి, తాలు, దుమ్ము లేకుండా ధాన్యాన్ని తూర్పారబట్టి, ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా చైతన్య పరచాలని ఆదేశించారు. వరికోత సమయంలో వరి నూర్పిడి యంత్రాల వారితో మాట్లాడి ఒక క్రమపద్ధతిలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి వచ్చేలా చూసుకోవాలన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ మన జిల్లాలోని కొనుగోలు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు ధాన్యాలకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలన్నారు. సన్న, దొడ్డు వరి ధాన్యాన్ని వేర్వేరుగా రైస్ మిల్లులకు తరలించటంతోపాటు రిజిస్టర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ప్రభుత్వ నియమాల ప్రకారం అన్నీ రకాల ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలు సోమవారం వరకు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైస్ మిల్లుల యజమానులు సన్నధాన్యం దిగుమతుల సమయంలో తగిన జాగ్రతలు పాటించాలన్నారు. రైస్ మిల్లుల వద్దకు వరి ధాన్యం తరలించే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. రైతు విక్రయించిన ధాన్యానికి 48 గంటలలో నేరుగా వారి ఖాతాలో డబ్బులు జమ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి, జిల్లా పౌరసరఫరాల శాఖ జీఎం, డీఎస్‌ఓ, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో టీ పీసీసీ అధ్యక్షుడికి ఘన స్వాగతం


కండ్లకోయ రింగ్ రోడ్డు జంక్షన్ వద్ద పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నేతలు

మేడ్చల్: టీపీసీసీ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటి సారి తన సొంత జిల్లా నిజామాబాద్‌కు వెళ్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు స్థానిక కాంగ్రెస్ నేతలు ఘన స్వాగతం పలికారు. కండ్లకోయ ఔటర్ రింగ్ రోడ్డు జంక్షన్ వద్ద నాయకులు అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఘనంగా స్వాగతం పలికి శాలువాలు, పూల దండలతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు దేవా, సురేందర్ ముదిరాజ్, సాయిపేట శ్రీనివాస్, రమణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లారీ బైక్ ఢీ: యువకుడికి తీవ్రగాయలు

- విషమంగా యువకుడి పరిస్థితి
- గాంధీ ఆస్పత్రికి తరలింపు


రోడ్డు ప్రమాదంలో గాయాలైన ఆకాశ్

ఘట్‌కేసర్: బైక్‌ను లారీ ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి-భువనగిరి జిల్లా బీబీ నగర్ మండలం కొండమగుడు గ్రామానికి చెందిన ఆకాశ్(20) చెర్లపల్లి పారిశ్రామిక వాడలో లేబర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం తన బావమరిదిని పల్సర్ బైక్ టీఎస్30-జీవై-4320పై ఘట్‌కేసర్‌లో దించి తిరిగి ఇంటికి వెళుతుండగా అవుషాపూర్ పెట్రోల్ బంక్ దగ్గరికి రాగానే పక్కనే రెండవ లైనులో ప్రయాణిస్తున్న లారీ టీఎస్07-యూఎన్6699 ఎలాంటి ఇండికేషన్ లేకుండా ఎడమ వైపు తిరిగాడు. దీంతో పల్సర్ బైక్‌పై వెళుతున్న ఆకాశ్ లారీ మధ్యభాగంలో తాకడంతో తల, కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడి స్నేహితులు, చుట్టు పక్కల వారు ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు

ఘనంగా బతుకమ్మ సంబురాలు

విద్యార్థినులతో కలిసి దాండియా ఆడిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో మల్లారెడ్డి విద్యాసంస్థల చైర్మన్, ఎమ్మెల్యే మల్లారెడ్డి దంపతులు బతుకమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థినులు, మహిళా అధ్యాపకులతో మల్లారెడ్డి, కల్పన దంపతులు బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి విద్యార్థినులతో కలిసి బతుకమ్మ, దాండియా ఆటలు ఆడి వారిని ఉత్సాహపరిచారు. ఎమ్మెల్యే కోడలు, మల్లారెడ్డి గ్రూప్స్ డైరెక్టర్ శాలినీరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మాధవీలత, అధ్యాపకులు పాల్గొన్నారు.


విద్యార్థినులతో కలిసి దాండియా ఆడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

నేడు ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో శనివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పర్యటించనున్నారు. మున్సిపల్ పరిధిలోని పలు వార్డులలో చేపట్టే అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో వారు పాల్గొంటారని అధికారులు, కౌన్సిలర్లు తెలిపారు.

వసతుల కల్పనకు కృషి

బోడుప్పల్: దశల వారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 14వ డివిజన్ పరిధిలోని కమలానగర్, రాయల్ మెడోస్ కాలనీల్లో శుక్రవారం ఆయన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్ కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


కట్టమైసమ్మకు లక్ష పూలతో అర్చన చేస్తున్న దృశ్యం


ఘట్‌కేసర్‌లో గాయత్రీదేవిగా...

మహాలక్ష్మీ నమోస్తుతే

- వేడుకగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- ప్రత్యేక పూజల్లో భక్తులు
- అమ్మవారిని దర్శించుకుంటున్న ప్రముఖులు

మేడ్చల్: దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండవ రోజైన శుక్రవారం గడిమైసమ్మ ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పలు కాలనీల్లో వెలసిన మండపాల్లో నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గడిమైసమ్మ ఆలయంలో భవానీ భక్తులకు నిత్య అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాఘవేంద్ర నగర్ కాలనీ, ఆర్టీసీ కాలనీ కట్టమైసమ్మ ఆలయం, అత్వెల్లి చాముండేశ్వరి ఆలయంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆర్టీసీ కాలనీ కట్టమైసమ్మ ఆలయంలో లక్ష పూలతో అమ్మవారికి అర్చన చేశారు.

గాయత్రీ దేవిగా అమ్మవారు

మేడ్చల్‌రూరల్: దేవీ శరన్నవరాత్రులు వైభవంగా కొనసాగాయి. నవరాత్రుల్లో భాగంగా రెండవ రోజు గాయత్రీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమివ్వగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి పూడూర్‌లో భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారి పూజల్లో పాల్గొన్నారు.

ఎంపీ ఈటల ప్రత్యేక పూజలు...

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం రాత్రి బీజేపీ నాయకులతో కలిసి నవరాత్రుల్లో పాల్గొన్న ఆయన అమ్మవారికి పూజలు చేశారు. పూజల్లో మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మోహన్ రెడ్డి, మున్సిపల్ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ ముదిరాజ్, కౌన్సిలర్లు మల్లికార్జున్ ముదిరాజ్, సరస్వతి, నాయకులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో గాయత్రీ దేవిగా...

ఘట్‌కేసర్: పట్టణంలో దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. స్థానిక గురుకుల్ క్రీడా మైదానంలో ప్రతిష్ఠించిన జై భవాని యూత్ మండపం అమ్మవారిని గాయత్రీ దేవీగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. నేతలు మశ్చేందర్‌రెడ్డి, శివప్రదీప్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, విక్రాంత్‌రెడ్డి, పవన్, అరుణ్‌ముదిరాజ్ పాల్గొన్నారు.


మహాలక్ష్మీ దేవిగా గడి మైసమ్మ


పూడూర్‌లో గాయత్రీ దేవిగా అమ్మవారు...


గుండ్లపోచంపల్లిలో ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ నాయకులు

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి


ఎంసీపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ గౌతమ్

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

శామీర్‌పేట్: రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మూడుచింతలపల్లి మండలంలో పర్యటించిన ఆయన మండల కేంద్రంలోని వీరారెడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నిర్మాణంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ... ప్రభుత్వ ఆస్పత్రులకు ప్రభుత్వం కల్పించిన మౌలిక వసతులను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని వైద్యాధికారికి సూచించారు. ఓపీ రికార్డులను పరిశీలించి, ఆసుపత్రిలోని పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించాలన్నారు. రెవెన్యూ కార్యాలయ రికార్డులను సరైన విధానంలో భద్రపరిచేలా స్ట్రాంగ్ రూంలను ఆధునీకరణ పద్ధతులతో నిర్మించాలని సూచించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా నిర్మాణ పనులు చేపట్టాలన్నారు.


ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేలో భాగంగా పోతారంలో పర్యటించిన కలెక్టర్

ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రక్రియ పరిశీలన..

ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇంటింటి సర్వేలో ఎలాంటి తప్పులు జరగకుండా పటిష్టంగా వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించబోయే ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేసిన మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం, పోతారం గ్రామాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలు పారదర్శకంగా సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఓ వెంకయ్య, డీఎంహెచ్‌ఓ రఘునాథస్వామి, కీసర ఆర్డీఓ ఉపేందర్‌రెడ్డి, మూడుచింతలపల్లి మండల తహసీల్దార్, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ


దుస్తులను పంపిణీ చేస్తున్న కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీలో పనిచేస్తున్న 360 మంది పారిశుద్ధ్య కార్మికులకు చైర్మన్ కొండల్‌రెడ్డి శుక్రవారం ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని కార్మికులకు దుస్తులను అందజేశామన్నారు. విజయదశమి పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కార్మికులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ వీరారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణి, నాయకులు సత్తిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, కరుణాకర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పోచారం: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా శనివారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు. ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పర్వతాపూర్ ఫీడర్ పరిధిలోని సప్తగిరి కాలనీ, సత్తిరెడ్డి బావి, ఫారెస్ట్ రేజ్ ఆఫీస్, సేజ్ స్కూల్ పరిసర ప్రాంతాలు, బాపూజీ నగర్, సర్వోదయ కాలనీ, ధరణి, సుదర్శన్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అన్నోజిగూడ ఫీడర్ పరిధిలోని అన్నోజిగూడ, ఎల్ఎస్ కాలనీ, ఎల్ఐజీ, జైపురి, సత్యానగర్, సాయినగర్, ఇందిరానగర్ ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తామన్నారు. మధ్యాహ్నం 12 నుంచి 12:30 గంటల వరకు జోడిమెట్ల ఫీడర్ పరిధిలోని జోడిమెట్ల క్రాస్ రోడ్, అన్నానగర్, కాకతీయనగర్, డాక్టర్స్ కాలనీ, అరుంధతి, స్వర్ణగిరి, వైష్ణవి కాలనీలతో పాటు చౌదరిగూడ గ్రామానికి విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వివరించారు.

జవహర్‌నగర్ పరిధిలో...

జవహర్‌నగర్: జవహర్‌నగర్ సాయిబాబా ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు మార్కెట్‌రోడ్డు, సిల్వర్‌సీ గల్లీ, ముత్తుస్వామి కాలనీ, మోహన్‌రావు కాలనీ, వెంకటేశ్వరకాలనీ, భక్తభాయి కాలనీ, వీరభద్ర కాలనీ, ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీ, ఆనంద్‌నగర్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ ఎర్రన్న తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4:30 వరకు చెన్నాపూర్ ఫీడర్ పరిధిలో సీఆర్‌పీఎఫ్, అరుంధతినగర్, మల్లెలగూడ, ఫరానగర్, ఫరూక్‌బస్తీ, మల్కారం, గోశాల, డంపింగ్‌యార్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఏఈ వివరించారు.

విద్యతోనే ఉత్తమ జీవనం: డీఎంహెచ్‌ఓ



బచ్పన్ ప్రయాస్ ప్రతినిధులతో డీఎంహెచ్‌ఓ రఘునాథ్‌స్వామి

పోచారం: విద్యతో సమాజంలో మంచి మార్పును తీసుకురావచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.రఘునాథస్వామి అన్నారు. యంనంపేట్‌లోని శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీకి చెందిన విద్యార్థులు ‘బచ్పన్ ప్రయాస్’ సేవా సంస్థ పేరుతో శుక్రవారం చేపట్టిన సేవా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యతోనే ఉత్తమ జీవనం సాగించవచ్చన్నారు. అజ్ఞానాన్ని నిర్మూలించి పిల్లలకు సుఖమయమైన బాల్యాన్ని అందించాలన్న సంకల్పంతో బచ్పన్ ప్రయాస్ సంస్థ పలు కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇందులో భాగంగా అనాథాశ్రమాలు, ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు, నీటి శుద్ధి పరికరాలు అందజేసి సామాజిక బాధ్యతను నిర్వర్తించడం ప్రశంసనీయమన్నారు.